# వెంటాడే భూతం

పంతుల జోగారావు




ఉన్నట్టుండి ఆకాశమంతా మేఘావృతమై పోయింది. దట్టమయిన మబ్బులు అంతటా ఆవరించి వాతావరణమంతా బీభత్సంగా తయారయింది. రివ్వున గాలి...దానితో పాటే చిన్న చిన్న చినుకులు ప్రారంభమయాయి. చీకటి చిక్కగా పులుముకుంది. బస్సు 'బర్ర్' మంటూ గొడవచేస్తోంది.

విసుగ్గా నిట్టూర్చాను. ఉద్యోగరీత్యా ప్రస్తుతం బొబ్బిలి విసిరివేయబడ్డాను. ఇదే మొదటిసారి — యింతకు ముందు ఎప్పుడూ బొబ్బిలి రాలేదు. ఒక్కడ్నే బయలుదేరాను. ఇల్లూ వాకిలీ చూసుకోవాలికదా? మధ్యాహ్నం రెండుగంటలకెక్కిన బస్సు, మధ్యలో రిపేరు వచ్చి గంటన్నర లేటయింది. తీరా, మళ్ళీ బయలుదేరేసరికి, కుండపోతగా యీ వర్షం! ఎవరు చెయ్యిఊపినా ఆగిపోతూ పీతనడక సాగిస్తోంది. ఒకటే బోరు. తెచ్చుకున్న వీక్లీని చదువుకుందామనుకుంటే బస్సులో లైట్లు లేవు. వీళ్ళకి పొదుపు చేయాలన్న ఆలోచన కాలం విషయంలో ఎందుకుండదో నా కస్సలర్థం కాదు!

బస్సులో అందరి ముఖాల్లోనూ చీదర, అలసట స్పష్టంగా కనిపిస్తున్నాయి.

'బొబ్బిలి ఇంకా ఎంత దూరముంటుందండీ?' అనడిగాను ప్రక్కనున్న వ్యక్తిని. బస్సురొదలో నా మాటలు వినిపించలేదు కాబోలు, పలకలేదు. తట్టి పిలిచాను. ఉలిక్కిపడి నావేపుచూచి తమాయించుకొని అన్నాడు; 'వచ్చేదేనండీ... బహుశా ఓ పావుగంట ప్రయాణం.'

ఈ వర్షం తగ్గేవరకూ బస్సు నడుస్తూ ఉంటే బావుండుననుకొన్నాను.

జేబులోనుంచి సిగరెట్ తీసి వెలిగించాను. నేను సిగరెట్ వెలిగించటం వలన ఎవరికియినా యిబ్బంది కలిగినా, నా దుస్తుల్నీ నన్నూ చూపి ఎవరూ అటంటపకచరనే నమ్మకం నాకుంది.

డ్రైవరు దగ్గరున్న అద్దంలోనుంచి రోడ్డుమీదికి చూశాను. హెడ్‌లైట్సు వెలుగులో, కురుస్తున్న వాన — ఎవరో ముత్యాలు వెదజల్లుతున్నట్లుగా ఉంది. వానలో తడుస్తున్న నల్లని తారురోడ్డు — సరస్సులో స్నానంచేస్తున్న అందమైన అమ్మాయి నల్లని పొడుగైన జుత్తు నీటిమీద తేలియాడుతున్నట్టుగా ఉంది.

పావుగంట గడిచాక — అంతదూరంలో మెర్క్యురీదీపాలు కనిపించాయి. సమయానికి ఆఫీసు జీపు రాకపోయినా బస్సెక్కాను తీరా యిది దార్లో యిబ్బందులకు గురిచేసినా, అంతదూరాన గమ్యం చూసేసరికి మనసు తేలికపడింది.

బస్సు మరో రెండు నిమిషాలలో స్టాండులో ఆగింది. బస్సు దిగాను. ఎక్కడా రిక్షాల జాడలేదు. కూలీలుకూడా ఎవరూ లేరు... విసుక్కుంటూ నాలు గడుగులు కదిలానో లేదో, అంతవరకూ చిన్నతుంపర్లుగా పడుతున్న వర్షం మళ్ళీ ఉధృతమైపోయింది పట్టుకున్న సూట్‌కేసూ, చిన్నహోల్డాలూ తడిసిపోతున్నాయి

ఇంతలో ఎవరో వ్యక్తి తలమీద తువ్వాలు కప్పుకునివచ్చి నా చేతుల్లోనుంచి సామాన్లందుకుంటూ 'వర్షం నావయిపోయింది బాబూ! తగ్గేవరకూ నా కొట్లో కూకుందురుగాని — రండి! అంటూ దారితీశాడు. నేనతనికి మనసులోనే థ్యాంక్స్ చెప్పుకుని అతని వెనుకే వెళ్ళి ఆ కొట్లో కూచున్నాను.

చుట్టూ పరికించి చూశాను. అదొక హేర్ కటింగ్ సెలూన్. కత్తులూ, కత్తెరలూ, పౌడరుడబ్బా ఓ బల్లమీద వరసగా పేర్చిఉన్నాయి. మూడువేపులా పెద్ద అద్దాలున్నాయి. కరెంటు లేనట్టుంది. కిరోసిన్ దీపాన్ని ఒత్తి హెచ్చిస్తూ అడిగాడతను: 'గడ్డంచేసేయమంటారేటి బాబూ?' నాకు నవ్వొచ్చింది. అదతని వృత్తిధర్మం, మరి! గడ్డం తడుముకుని చూశాను. గరుగ్గానే ఉంది. 'ఇప్పుడొద్దులేవోయ్' అన్నాను.

'ఏ వీధి వెళ్లాలి బాబూ ! ఇయాల ఎదవనాయాలలు, యీ వర్షానికి నౌకరిజ్ఞా వాడూ కనిపించలేదు_'

"ఏ వీధీ కాదోయ్_ఈ ఊర్లో మంచి హోటలేదోయ్ ?"

తడుముకోకుండా జవాబిచ్చాడతను: 'శాంతి భవనమేనండి... అల్లద...ఆ పచ్చలైటు ఎలుగుతోందా? దాని పక్కనే దాన్నిమించిన ఓటేలు యిజీనగరంలో కూడా నేదు !"

వర్షం తగ్గిపోయింది పూర్తిగా. నేనెంత వారించినా వినకుండా అతను దుకాణం కట్టేసి, నా సామాన్లు పట్టుకుని నా వెనుకనే బయలుదేరాడు వాడు చూపిస్తున్న ఈ అకారణ గౌరవానికి నాకాశ్చర్యంవేసింది. కారణం నా వేషం కావచ్చును.

హోటలు చేరాక వాడు శలవు తీసుకొని వెళ్ళిపోయాడు. భోజనం చేసి మంచమెక్కాను. మర్నాడు ఉదయాన్నే తలుపులెవరో తడుతూఉంటే మెళకువ వచ్చింది. నిద్రమత్తు యింకా వదలలేదు. కళ్లు బరువుగా ఉన్నాయి. విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీశాను. రాత్రి నాకు సహాయంచేసిన మంగలి. నన్ను చూస్తూనే నవ్వుతూ 'గడ్డం చేయడాని కొచ్చాను బాబయ్యా... ఈ ఓటేల్లో పెరిమినెంటుగా సేసేవాడు యేరే ఉన్నాడు...ఆడికి వారంరోజులై జొరం, నెగనేదు... పొప్పరైటరు బాబు నన్ను కకస... ఒంపాలగ... అడొగ్రనుయుం.. కావాలంటే నువ్వు సేసుకుపోరా... అన్నారు... నాను షాపొగ్గి యిలా ఎప్పుడూరాను...నిన్నామొన్నా అందుకే రానేదు... ఇయాల మీరొచ్చారు గదా అని...'

అప్పుడు తెలిసింది. వాడి పేరు పోలిగాడన్నమాట. రాత్రి అడగనేలేదు.

వాడు నా కోసమే పనిగట్టుకుని వచ్చినట్లు మాట్లాడేసరికి మాత్రం చిరాకేసింది తైరుకొడుతున్నాడనిపించింది. ఇంకా చనువిస్తే మంచిదికాదేమో అది నాహోదాకే భంగకరం అనేభయం నాలో ఓ మూల నుంచి బెదిరికొడుతోంది. వాడిదీ నౌకరీవే_నాది నౌకరీవే ఒక విధంగా వాడే నాకన్నా స్వతంత్రుడు. కాని వాడిలో ఉండే అణకువలో నూరో వంతయినా నాలో లేదు

బ్రష్ చేసుకుని వచ్చేసరికి వాడు వరండాలో బిచానా పరచి సిద్ధంగా కూర్చున్నాడు. నేను వాడిముందు కూర్చుంటూ అద్దం అందుకున్నాను. గడ్డం గీస్తూ కబుర్లు ప్రారంభించాడు. వాడు చెప్పేదంతా నేను సావధానంగా వినకపోయినా, నా బుర్రలోకి వెళ్ళగలిగిన నాలుగు ముక్కలనీ పోగుచేస్తే దాని సారాంశం యిది : వాడికి ఆరుగురు పిల్లలు. తన ఆరోగ్యం బాగులేక పెద్దవాడ్ని చదువు మానిపించి పనిలో పెట్టాడు. వాడికిప్పుడు

కూడా బాగుపడింది... భార్య రోగిష్టిది...

వా డీసోది అంతా నాతో కారణముండి చెబుతున్నాడని నే ననుకోను. ఎందుకంటే కొంతమందికది అలవాటు, ఉన్నవీ—లేనివీ కూడా— చెప్పుకోవటంలో వారికి ఓ విధమయిన రిలీఫ్ లభిస్తుంది. మా అవ్వకి యిలాగే తన అనారోగ్యం గురించి నలుగుర్ని పోగేసి, నీరసంగా మూలుగుతూ చెప్పుకోవటమంటే యిష్టం. అదేం మనస్తత్వమో నాకర్థంకాదు.

షేవింగ్ పూర్తయాక డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు. నేను స్నానం ముగించి ఆఫీసుకి బయలుదేరాను.

ఆ తరువాత నేను ఓ వారంరోజులలో నలభై రూపాయలకు ఓ యిల్లు చూసుకుని కుటుంబాన్ని తీసుకొచ్చాను. పోలిగాడు మా యింటి మంగలయిపోయాడు. రెండు రోజుల కొకసారి వాడు ఉదయాన్నే పొది పట్టుకుని మా యింటికి హాజరు. నాకు స్వంతంగా షేవ్ చేసుకునే అలవాటు తొలినుంచీ యేర్పడలేదు.

నిజానికి వాడు నాకు అందించిన సహకారం గొప్పదేనని చెప్పాలి. నాకు శ్రమలేకుండా, యీ యిల్లు ఖాళీగాఉన్న వార్త మోసుకొచ్చింది వాడే. మొదట్లో, గుడ్డలన్నీ మాసిపోయి కంపు కొడుతున్నాయన్న అసహ్యంతో ఎవడినో చాకలివాడ్ని పిలుచుకొచ్చి అన్ని గుడ్డలూ వాడికి రోజులైనా పత్తా దొరకలేదు. మాకు గంగ వెర్రులెత్తింది. అలాంటి పరిస్థితిలో పోలిగాడే మా వాడ్ని తోడ్చుకుని వెళ్ళి గాలించి వాడ్ని పట్టుకున్నాడు. వా దేవోసాకులు చెప్పి బట్టలిచ్చేశాడు. ఆ తరువాత పోలిగాడే ఓ నమ్మకస్థుడైన చాకలిని మా యిల్లు చేసుకుందుకు కుదిర్చాడు.

మొదట్లో నేను బెట్టుగా ప్రవర్తించినా, రోజులు గడిచినకొద్దీ వాడికి నా దగ్గర చనువు ఎక్కువయింది. మా ఆవిడి కూడా వాడికి అడపాదడపా ఏవో నంజుకుందుకి యిస్తూ ఉంటుంది...

వాడు షేవ్‌చేస్తూ తెగ కబుర్లు చెప్పేవాడు. వాడి సందేహాలన్నీ నా దగ్గర వెళ్ళగ్రక్కేవాడు : 'అయితే బాబూ : ఈ ఎలక్షన్లలో కాంగిరేసోళ్ళు రాకపోతే...చైనావోళ్ళు మన దేశాన్ని లాక్కుంటారా ?" లాంటి ప్రశ్నలడిగేవాడు. నవ్వుతూ సమాధానాలు చెప్పేవాడిని

ఓకసారి వరసగా వారం రోజులు వాడు కనిపించలేదు నాకేమీ తోచలేదు. వాడేమైనా బంధువా మనసు యిలా అవటానికి ? అని తర్కించుకున్నాను. సమాధానం చిక్కలేదు.

నిజానికి వాడికాస్థితిలోకన్నా ఎక్కువ విలువ నివ్వటం నాకు నచ్చని విషయం. కాని... నాకు తెలియకుండానే వాడు




నా దైనందిన జీవితంలో కొంతచోటు చేసుకున్నాడు!

వారంరోజుల అనంతరం ఓ ఉదయం వచ్చాడు. ముఖం ప్రసన్నంగా లేదు. ఏదో యింట్లో గొడవలు చెప్పాడు. భార్య అస్సలు లేవలేక పోయిందట. పిల్లలకు తానే గంజికాచి పోశాట్ట. పెద్దవాడు వేరుపడిపోయాట్ట తననుంచి. రెండోవాడ్ని చదువు మానిపించి పనిలో పెడదామనుకుంటే — వాడు ససేమిరా అంటున్నాడట. "అసలాడ్ని యింత వరకూ చదివించటమే పాపమైపోనాది!" అంటాడు.

"ఏం చదువుతున్నాడేమిటి?" అనడిగాను.

"ఏడో తరగతి బాబూ!"

ఇటీవల కొంతకాలం నుంచీ నాకు పోలిగాడి కుటుంబాన్ని సంస్కరిద్దామని మహా కోరికగా ఉంది. వాడి అజ్ఞానం వల్లనే వాడిన్ని కష్టనష్టాలకు గురి అవుతున్నాడని నా అభిప్రాయం. "వాడ్ని కొంచెం మార్చాలి" అనుకున్నాను.

ఆ ఉద్దేశంతోనే చదువుకు వున్న విలువ చెప్పి — ఆ అబ్బాయిని చదువు మానిపించవద్దని సలహా యిచ్చాను. కుల వృత్తి చేసుకోవటం అవసరమే కాని— కుటుంబంలో అందరూ దాని పేరిట అన్యాయంగా ఒక స్థితినిదాటి బయటకి రాలేకపోవటం నాకు కష్టమనిపించింది: వాడి కొక ఆశ కూడా చూపించాను.

దబ్బుకి యిబ్బందే ననుకో...కాని... మన కష్టం, వాళ్ళు ఉద్యోగాలుచేసి గడిస్తున్నప్పుడు కలిగే తృప్తిలో ఓనిపించదు...నా మాట విని వాడ్ని చదివించు... ఇంటరవగానే, నేనే మా ఆఫీసులో యేదేనా ఉద్యోగం వేయించగలను___"

నా మాటలు విని ఆశగా నా ముఖంలోకి చూశాడు. అప్పుడు వాడి కళ్ళలో వెలిగిన వెలుగు నాకింకా గుర్తుంది. "అలాగే బాబూ! ఆడ్ని చదివిస్తాను... ఈ ఎదవ యిబ్బందులు తెల్లారి నెగిస్తే ఎలాగూ వుండేవే..." అన్నాడు

* * *

నన్ను ఉన్నట్టుండి అనకాపల్లి బదిలీ చేశారు. ఉద్యోగరీత్యా నాలుగు ఊళ్ళు తిరగటానికి అలవాటు పడిపోవటంచేత నాకేమీ కష్ట మనిపించలేదు. ఎక్కడ పరిచయమయిన వాళ్ళు అక్కడే ఆత్మీయులు! పోలిగాడు మాత్రం నేను బొబ్బిలి వదిలేస్తున్నందుకు చాలా బాధ పడిపోయాడు.

సామాన్లు పేక్ చెయ్యటంలో వాడు చాలా సహాయం చేశాడు. సామానంతా లారీలో వేశాక_మేం జీపు ఎక్కబోతూ ఉంటే యిలా అన్నాడు: "బాబూ! సదువు యిలవ సెప్పి, నా కన్ను తెరిపించారు...నేదంటే ఆ డీపాటికి కత్తెర పుచ్చుకుని కొట్లో పడి యేడుద్దుడు... యీపాటికి యింటరు చేసేస్తాడు... ఆపైన మీ దయ... ఏ నౌకరీ యిప్పిస్తారో..."

వాడి కళ్ళలో సన్నగా నీళ్ళు తిరగటం గమనించి నాకూ కష్టమనిపించింది. "అలాగే" నని చెప్పి జీపెక్కాను.

* * *

అనకాపల్లి వెళ్ళాక, కొద్ది కాలంలోనే వాడ్ని నేను మరిచిపోయాను. మొదట్లో కొడుకుచేత నా ఆఫీసు అడ్రసుకి నా క్షేమాలని అడుగుతూ ఉత్తరం వ్రాయించాడు. నేను గాభరాపడి, ఇంటి అడ్రసు యిస్తూ ఓ కార్డుముక్క రాసి పడేశాను. ఆ కార్డు పోస్టు చేసేముందు నా మనసెంత పీకిందో నాకు తెలుసు. నా స్టేటస్‌ని నేనే అవమానపరచు కుంటున్నట్టు బాధ పడ్డాను.

చాలా రోజుల తరవాత మళ్ళీ వాడి నుంచి ఉత్తరం వచ్చింది. రెండోకొడుకు యింటరు పాసయాట్ట...ఏదేనా ఉద్యోగం వెయ్యమని!

వాడి కొడుక్కేకాదు; ఎవరికీ కూడా ఉద్యోగం యిప్పించ గలిగే స్థితిలో లేనన్న నిజం... పాపం, వాడికెలా తెలుస్తుంది? అప్పట్లో చదివించమని సలహా అయితే యివ్వగలిగాను కాని___ నిరుద్యోగ సమస్య దారుణంగా మారిపోయిన యీ స్థితిలో___ఆఫ్టరాల్___నా లాంటి వాడు యింకొకడికి ఉద్యోగం

నౌకరీ నిలుపుకోగలిగితే అదే పదివేలు!

నేను వాడి ఉత్తరానికి ఏం జవాబు రాస్తాను! అభిమానం అడ్డొచ్చింది. వెక్కిరించిం దంటే బాగుంటుందేమో. ఆ తరవాత నాలుగు నెలలలో ఆరుత్తరాలొచ్చాయి. వాటిని యింట్లో ఎవరికంటా పడకుండా దక్కించుకో గలిగాను. ఇలాగే రాస్తూంటే ఎవరయినా చూస్తారేమోనని భయం పట్టుకుంది నాకు. వాడిలా డైరెక్టుగా ఉత్తరాలు వ్రాయటం నాకు చిరాకు కలిగించింది.

ఆ తరువాత ఉత్తరాలు తగ్గిపో యాయి నా మనసు తేలిక పడటం నాకే అసహజంగా తోచింది.

ఇక్కడొక ముఖ్యమయిన విషయం చెప్పాలి...

ఈ మధ్యకాలంలో నాకు ఒకటి రెండు పర్యాయాలు బొబ్బిలి ఆఫీసుపని తగి లినా—పోలిగాడి ఎదుట పడటం యిష్టం లేక తప్పించుకున్నాను నేను వాడి ఎదుట పడటానికి జంకుతున్నానా? ఒప్పుకోవటానికి మనస్సుకి చిన్నతనం! "ఏం బాబూ! కొడుకుని చదివించు... ఉద్యోగం వేయిస్తానన్నావు... యింతేనా?" అని వాడడిగితే నేనేం సమాధానం చెప్పగలను?" అనే అభిప్రాయం నాకు లోపల్లోపల పీచు పీచు మంటోంది.

ఈ పర్యాయం వెళ్ళటం తప్పని సరయింది.

*　　*　　*

ఇంతవరకూ ఆలోచిస్తూ కూర్చున్న నేను ఆలోచనలనుండి తేరుకున్నాను చీకటి పడిపోయింది. వర్షం కుంభపోతగా కురు స్తోంది. వర్షం తగ్గేవరకూ బస్సులోనే కూర్చుని, తగ్గేక బస్సుదిగి శాంతి భవనంవేపు దారితీశాను.

నా కీఊరు వచ్చిన తొలిరోజు గుర్తొచ్చింది... అప్పుడూ వాతావరణం యిలాగే ఉంది.

నా ఆలోచనలలో పోలిగాడు మళ్ళీ ప్రవేశించాడు. వాడు నన్నెంత తిట్టు కుంటున్నాడో? అయినా తన పిచ్చిగాని—వాడి కొడుక్కి యీపాటికి ఏదో ఉద్యోగం దొరికి ఉండదూ? అయినా—యిల్లు మార టంవలన వాడి ఉత్తరాలేమీ నా కంద లేదని అనేస్తే ఏంపోయింది!

మోసం చెయ్యటానికి ఓ కిటుకు లభించటంతో నా మనసు తేలిక పడింది!

వర్షం మళ్ళీ హెచ్చయింది. తడిసి పోతున్నాను. ఎవరో వ్యక్తి గొడుగు వేసుకుంటూ నావేపు వడివడిగా వచ్చాడు. "గొడుగులోకి రండి బాబూ! తడిసి ముద్దయి పోతున్నారు" అంటూ. వాడు నాకు గొడుగు పడుతూ తను తడిసిపో తున్నాడు. నాకు కష్టమనిపించింది. ఎల క్ట్రిక్ లైటు వెలుగులోకొచ్చేసరికి అతను నన్ను గుర్తించాడు. "మీరా బాబూ!" అని పలకరించాడు ఆశ్చర్యంగా.

పోలిగాడు! ఎంత మారిపోయాడు! ఆ కళ్లు ఎంత పీక్కుపోయాయో? మనిషి ఎంత పల్చబడి పోయాడో!

వాడి గురించి అడగకుండా ఉండలేక పోయాను: 'ఏమోయ్...బాగున్నావా?' ఇంకా యీ టెక్కు నాకెందుకో అర్థం కాదు.

వాడి కళ్లలో సన్నగా నీళ్లు తిరిగాయి. "ఏం బాగు బాబూ! యింటిది పోయి ఆర్నెళ్లయింది. మూడో పిల్లకూడా జబ్బు చేసి పోయింది..."

"మరి...పెందోవాడు?..." అత్రుతని అణచుకోలేకపోయాను.

"ఆడా! ఇంటరు పేసయినాడు బాబూ! సేనారోజులు ఉద్యోగంకోసం చూసాడు. దొరకనేదు... పోనీ పని చేసుకోరా— కులంపని ఎట్టాగా ఉంది కదా? అంటే అందుకు ఆడికి సిన్నతనమైపోనాది..."

వాడు నామీద నిష్ఠూరం వెయ్యలేదు. అందుకే ఎక్కువగా బాధ కలిగింది.

"నీ ఉత్తరా లందాయిరా...కాని ఏం చెయ్యటం? ఇదివరలో అయితే మేనేజరు మన చేతుల్లో ఉండేవాడు... నిమిషాలమీద పన యేది...ఇప్పుడలా కుదర్దు... అయినా చూస్తున్నానులే... ఎక్కడ వేకెన్సీ దొరికినా వాడ్ని దూర్చేద్దాం—" ఇంకా అబద్ధం చెప్పకుండా నాకే అసహ్యం వేస్తోంది.

నిర్లిప్తంగా నిట్టూర్చి అన్నాడు: "అంత అదురుష్టమా బాబూ, మాకు! ఇక ఉద్యోగం దొరకదని చెప్పి ఆడు కొంపనోంచి ఎటో పారిపోనాడు...ఇటు ఉద్యోగమా నేదు — అటు కులం పనికి సెడ్డాడు... ఏం బతుకులో యేమో" వాడి గొంతు వొణుకుతోంది సన్నగా. నేను మాట్లాడలేకపోయాను.

హోటలు మెట్లెక్కుతూ, వర్షంలో నన్నిలా పొడిగా చేర్చినందుకు కనీసం కృతజ్ఞతలయినా చెప్పకుండా మనిపించింది "రక్షించావురా, పోలీ! సమయానికి నువ్వు రాకపోతే—ఇవాళ సాంతం తడిసి ముద్దయి పోయేవాణ్ని" అంటూ వాడివేపు చూసాను—

అయ్యో!

అంత ముద్దగా తడిసి పొయ్యాడేం? గొడుగంతా నాకే పట్టినట్టున్నాడు! అరె! పాపం...

నీళ్లోడుతూ,—

చలికి సన్నగా వణుకుతూ,—

నన్ను పొడిగా చేర్చగలిగినందుకు తృప్తి నిండిన చూపులతో —

పోలిగాడు!

బలవంతంగా దృష్టి మరల్చుకొని హోటల్లోకి దారితీసాను

